క్లుప్తంగా

నేడు విద్యార్థులకు డిజిటల్ పరికరాల అందజేత

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు డిజిటల్ తరగతి పరికరాలు, సైన్స్ పరికరాలు, క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం రెండున్నరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయరాం విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరౌతున్నట్లు తెలిపారు. 2022–23 ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్మాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు, ఆకుతోటపల్లి, పోలెపల్లి, చుక్కాపూర్, తలకొండపల్లి, కర్కల్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

19న సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కడ్తాల్: మండలంలో నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొంది ఉండి, 18 నుంచి 59 సంవత్సరాల్లోపు రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సంబంధిత క్లస్టర్ కార్యాలయంలో ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు ఆధార్ కార్డుల్లో ఏమైనా మార్పులు ఉన్నా, నామినీ మార్చాలనుకున్నా సంబంధిత ఏఈఓను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

యాచారం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన నారమ్మ, యాదయ్య కుటుంబ సభ్యులకు గురువారం పగడాల కనకయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారి కుటుంబానికి భవిష్యత్‌లో ఫౌండేషన్ తరఫున అండగా ఉంటామని భరోసా పలికారు. ఫౌండేషన్ సభ్యులు రంజిత్, అరుణ్, విష్ణు, ప్రణయ్ పాల్గొన్నారు.

సోమ్లానాయక్‌కు..

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన నేనావత్ సోమ్లానాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. బాధితుడిని గురువారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఫౌండేషన్ తరఫున రూ.5వేల ఆర్థికసహాయాన్ని అందించారు. మల్లేశ్, రవి, ఫకీరా, ఆకాశ్, తావు, శ్రీను, సికిందర్, కిరణ్ ఉన్నారు.

వార్డుసభ్యురాలి రాజీనామాకు ఆమోదం

ఆమనగల్లు: మాడ్గుల మండలం పల్గుతండా గ్రామ పంచాయితీ 7వ వార్డు సభ్యురాలు జటావత్ హస్లీ రాజీనామాను ఆమోదించినట్లు మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇర్విన్ మండలంలో కాకుండా పల్గుతండాను మాడ్గుల మండలంలో కొనసాగించాలని కారణం చూపుతూ వార్డు సభ్యురాలు హస్లీ రాజీనామా చేశారని.. ఈ మేరకు ఆమె రాజీనామాను ఆమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన నరేందర్‌కు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం ఎమ్మెల్సీ నారాయణ్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఖానాపూర్‌కు చెందిన చంద్రారెడ్డి (76) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కశిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఇన్‌చార్జి పాలన?

- ఇబ్రహీపట్నంలో పరిపాలన అస్తవ్యస్తం
- పూర్తిస్థాయి ఎంపీడీఓ లేక పనులపై అజమాయిషీ కరువు
- పౌరసేవల్లో తీవ్ర జాప్యం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలో శాశ్వత ఎంపీడీఓ లేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా తయారయ్యింది. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల ప్రజాపరిషత్ అధికారి అంటే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు బాస్. అలాంటి కీలక అధికారి పూర్తిస్థాయిలో లేకపోవడంతో పాలన గందరగోళంగా మారింది. ప్రజలకు కూడా నిర్ణీత సమయంలో సేవలు అందడంలేదు.

దీర్ఘకాలిక సెలవులపై ఎంపీడీఓ..

గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ మహేష్‌బాబు కొన్ని కారణాలతో వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. దీంతో దాదాపు నాలుగు నెలలపాటు సూపరింటిండెంట్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు. అనంతరం కొత్తగా జయరాం విజయ్ అనే మరో అధికారి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరి నాలుగు నెలలు గడవక ముందే(అక్టోబర్ 20, 2022 నుంచి) అనారోగ్య సమస్యతో ఆయన దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లారు. దీంతో మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్‌ను ఇక్కడ ఇన్‌చార్జిగా కేటాయించారు. రెండు మండలాలు కవర్ చేయాల్సి రావడంతో పనిభారం ఎక్కువవుతోందని ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. మరోమారు సూపరిండెంట్‌కే ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఇలా గత రెండేళ్లుగా ఇన్‌చార్జిల పాలనతోనే నెట్టుకొస్తున్నారు.



ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం

కొరవడిన సమన్వయం..

మండలం మొత్తానికి బాస్ అయిన ఎంపీడీఓ.. వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ విభాగం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ తో పాటు మరికొన్ని ప్రభుత్వ శాఖలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలందించాలి. అయితే అలాంటి బాస్ స్థానంలో ఉండాల్సిన ఎంపీడీఓ లేకపోవడంతో అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించడంలేదు. అధికారుల మధ్య సమన్వయం కొరవడింది. గ్రామ పంచాయతీల్లో అమలుచేయాల్సిన పల్లె ప్రగతి కార్యక్రమాలు, కల్లాలు, క్రీడా మైదానాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలపై ప్రతిరోజు పర్యవేక్షించి కిందిస్థాయి అధికారులతో మాట్లాడాలి. ప్రస్తుతం పన్నుల వసూళ్ల కార్యక్రమం నడుస్తుంది. గ్రామ పంచాయతీలవారీగా వారి టార్గెట్లను చేరుకోవడంపై సమీక్షించాలి. పూర్తిస్థాయి ఎంపీడీఓ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

ఉపాధి పనులపై పర్యవేక్షణ కరువు..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారి వివరాలను ప్రతిరోజు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ అధికారుల తీరు ప్రజల్లో విస్మయానికి గురిచేస్తుంది. పనులు చూపించాలి.. రోజువారిగా మస్టర్లు, పేమెంట్ చేయాలి. అయితే వారు ఆయా విధులను పూర్తిస్థాయిలో చేయడం లేదంటూ విమర్శలున్నాయి. ఇలాంటి పనులు సకాలంలో జరగాలన్నా, ప్రజలకు మంచి పరిపాలన అందాలన్నా పూర్తిస్థాయిలో ఎంపీడీఓ ఉంటే తప్ప పనులు కావాని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు ఉండటంలేదు



సంక్షేమ పథకాల గురించి తెలుసుకుందామని ఎంపీడీఓను కార్యాలయానికి వెళ్తే ఎవరికి అధికారులెవరూ అందుబాటులో ఉండటంలేదు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. దీంతో పౌరసేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

– తాళ్లపల్లి వెంకటేశ్, పోచారం

ఎంపీడీఓను కేటాయించాలి



రెండు నెలలకు ఒక ఎంపీడీఓ మారుతున్నారు. ప్రస్తుతం మంచాల మండలానికి చెందిన ఎంపీడీఓ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన ఎప్పుడు ఎక్కడ ఉంటాడో తెలియని పరిస్థితి. తక్షణమే పూర్తిస్థాయి ఎంపీడీఓను కేటాయించి ఆదుకోవాలి.

– జంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి

'సర్వసేవా' భవనాల కూల్చివేత తగదు

సంఘ్ జాతీయ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి

హయత్‌నగర్: భూదానోద్యమ స్ఫూర్తితో ఆచార్య వినోభాబావే నిర్మించిన సర్వ సేవా సంఘ్ భవనాలను బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూల్చివేస్తున్నారని సర్వసేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి ఆరోపించారు. యూపీలో సర్వసంఘ్ భవనాల కూల్చివేతను నిరసిస్తూ గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పావయ్యగూడలోని గుడిసెల కేంద్రంలో పడసబోయిన సైదులు ఆధ్వర్యంలో ఒకరోజు దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ స్ఫూర్తితో వినోభాబావే నిర్మించిన సర్వ సేవా సంఘ్ భవనాలు చరిత్రకు ఆనవాలుగా నిలుస్తున్నాయని అలాంటి భవనాలను కూల్చివేయడం తగదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో సర్వసేవా సంఘ్ నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎంపీపీ కొప్పు సుకన్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాలు కురిసిన వెంటనే హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామాల వారీగా టార్గెట్ల ప్రకారం మొక్కలు నాటాల్సిందేనని అన్నారు. మొక్కలు నాటే విషయంలో ప్రజలను భాగాస్వామ్యం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉన్న దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుద్రోహి కాంగ్రెస్ పార్టీ

విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ఆమనగల్లు: వ్యవసాయరంగానికి ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా మాడ్గుల మండలంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మాడ్గుల మండల పరిధిలోని మాడ్గుల, నాగిళ్ల, ఇర్విన్, ఆర్కపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు ద్రోహి అని మండిపడ్డారు. ఈ కార్యక్రమాల్లో ఇర్విన్‌లో.. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ రవితేజ, నాయకులు పుష్పలత, తిరుపతమ్మ, జంగయ్య, వెంకటయ్య, శేఖర్, మాడ్గులలో.. బీఆర్‌ఎస్ నాయకులు లాలయ్యగౌడ్, విష్ణు, తిరుపతయ్య, కుమార్, వెంకటేశ్, నాగిళ్లలో.. చెన్నయ్య, శ్రీను, ఆర్కపల్లిలో సర్పంచ్ వాస్‌రాంనాయక్, నాయకులు విజయ్‌కుమార్, షేక్ జమీల్, శివలింగం, చెన్నకేశవులు, శ్రీశైలం, పవన్, బద్రీగౌడ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వెల్జాల్ సబ్‌స్టేషన్ ఎదుట..

తలకొండపల్లి: ఉచిత విద్యుత్‌పై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెల్జాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు సభ్యులు శ్రీరామ్, మోహన్‌లాల్, దస్తగిరి, అభిలాష్, రాజు, వెంకటయ్య, శ్రీనివాసులుగౌడ్, శ్రీను, పాండు, చెన్నకేశవులు, సల్మాన్, సాయి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీపీసీసీ కమిటీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడిగా వెట్టిచాకిరీ చేస్తున్నారన్నారు. కనీసవేతనం ఇవ్వకపోగా ఉద్యోగ భద్రత లేదన్నారు. ప్రభుత్వం వారికి ఉద్యోగ భద్రత కల్పించి పనికితగిన వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రాందాస్, కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్, లింగం, చరణ్, గోవర్ధన్‌రెడ్డి, ధన్‌రాజ్, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ..

యాచారం: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె గురువారం కొనసాగింది. ఈసందర్భంగా సిబ్బంది యాచారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్: కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన..

హయత్‌నగర్: ఎనిమిది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం తమన పట్టించుకోవడం లేదని నిరసిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, జిల్లా సీఐటీయూ నాయకలు నర్సింహ మాట్లాడుతూ... కార్మికుల శ్రమ ఫలితంగా అవార్డులు అందుకుంటున్న అధికారులు వారి సమస్యలను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ వైఖరి ఇదేవిధంగా ఉంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సిరెడ్డి, కనకయ్య, ప్రభాకర్, శివకమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతా..

- పెద్దఅంబర్‌పేట వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ
- బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతానంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని వెల్లడి

అబ్దుల్లాపూర్‌మెట్: తాను కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నానంటూ వస్తున్న వార్తలో వాస్తవం లేదని.. కావాలనే కొంతమంది గిట్టనివారు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీఎం చేయాలన్న ఆకాంక్షతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఒకవేళ పార్టీ మారాల్సిన పరిస్థితులు వస్తే పూర్తిగా రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్ప ఇతర పార్టీల్లో చేరనని కరాఖండిగా చెప్పారు. తాను కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీలో స్థానికంగా కొన్నిరోజులుగా చోటుచేసుకుంటున్న సంఘటనలపై స్పందిస్తూ.. ఇలాంటి సంఘటనలు ప్రతి రాజకీయ పార్టీలో సహజమేనని.. అంత మాత్రాన పార్టీ మారాల్సిన అవసరం తనకు లేదని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడుతున్న తనపై కొంతమంది కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఆమె సూచించారు.

ఇబ్రహీంపట్నం ఆర్డీఓగా అనంత్‌రెడ్డి



తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఆర్డీఓగా సిద్దిపేట నుంచి బదిలీపై వచ్చిన అనంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన వెంకటాచారికి అడిషనల్ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం రాగన్నగూడలోని ఆర్డీఓ కార్యాలయంలో వెంకటాచారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు అనితారెడ్డి, సుచరిత, అనిత పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల ఉపాధ్యక్షుడిగా మడుపు వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి.. వెంకటేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన వెంకటేశ్ కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నందున పార్టీ గుర్తించి ఈ బాధ్యత అప్పగించింది. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన పార్టీ పెద్దలకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు. అందరినీ కలుపుకుని పోయి ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదిశగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి ముందుకు వెళ్తామన్నారు.

ఆమనగల్లు ఎస్‌ఐగా బల్‌రామ్



ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా కె.బల్‌రామ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆమనగల్లు ఎస్‌ఐగా పనిచేసిన సుందరయ్య శంకరపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా శంషాబాద్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న బల్‌రామ్ గురువారం ఆమనగల్లుకు బదిలీ అయ్యారు.

ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచాలంటూ..

నేడు బీజేపీ ఒక్కరోజు దీక్ష

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి స్థాయిని పెంచి 150 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ స్వయంగా ఆస్పత్రి స్థాయిని పెంచి 150 పడకల ఆస్పత్రిగా మారుస్తామని ప్రకటించారని.. ఐదేళ్లు కావస్తున్నా సీఎం హామీ అమలు కాలేదని ఆయన విమర్శించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి



కమ్మగూడెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఆచారి, బీజేపీ నాయకులు

బీజేపీ సీనియర్ నేత ఆచారి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి సూచించారు. మాడ్గుల మండలంలోని తోడేలుగుండుతండా, తుర్కలకుంట, కమ్మగూడెం, చంద్రాయణపల్లి, కలకొండ, ఇర్విన్, రాందుగ్యాల, గిరికొత్తపల్లి గ్రామాల్లో మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం ఆచారి పర్యటించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. కేంద్ర పథకాల గురించి సరైన ప్రచారం లేకపోవడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి రఘుపతిగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్, బీజేపీ నాయకులు శ్రీను, కాటంగౌడ్, కమలేశ్, జంగయ్యయాదవ్, పర్వతాలు, జంగయ్య, సత్యం, వెంకటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంక్షేమ పథకాలు భేష్



కడ్తాల్‌లో దళితబంధు లబ్ధిదారుడి పశువుల షెడ్డును పరిశీలిస్తున్న అధికారుల బృందం

కడ్తాల్‌లో వివిధ రాష్ట్రాల అధికారుల పర్యటన

కడ్తాల్: తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఆదర్శవంతంగా ఉన్నాయని వివిధ రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ, ఇతర శాఖల అధికారులు పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థలో గత మూడురోజులుగా శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది అధికారుల బృందం సభ్యులు గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి గ్రామంలో.. దళితబంధు పథకం ద్వారా లబ్ధిపొందిన పోతగళ్ల మహేశ్.. పశువుల షెడ్డును అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి చేయూతనందిస్తున్న విధి విధానాలు మెరుగ్గా ఉన్నాయని, బడుగు బలహీనవర్గాల వారు అభివృద్ధి చెందడానికి ఇలాంటి పథకాలు దోహదపడుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిక్కిం సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ సెక్రటరీ కిషోర్ ప్రధాన్, కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సుమజ, మహారాష్ట్రకు చెందిన జీఎం ఈడీ ఎంపీబీసీడీసీ అధికారి ప్రశాంత్ గేదం, ఉత్తరప్రదేశ్ జీఎం, ఎస్డీ ఎప్పీ అధికారి జయరాం, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రవీణ్‌రెడ్డి, వార్డుసభ్యులు, స్థానిక నాయకులు ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. మండల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని నేతలు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మండల ఏర్పాటుకు కృషిచేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు. భవిష్యత్‌లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

దండుమైలారంలో మంచినీటి ఎద్దడి

ఇబ్రహీంపట్నం: దండుమైలారం గ్రామంలో గత వారం రోజులుగా మంచినీటి ఎద్దడి తీవ్రమైనట్లు వైఎస్సార్‌టీపీ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు చీమల మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టడంతో గ్రామంలో తాగునీటి ఇబ్బందులు మొదలైనట్లు చెప్పారు. కార్మికులు సమ్మె చేస్తుండటంతో మంచినీటిని పంపిణీ చేసే వారు కరువైనట్లు తెలిపారు. సుమారు 8 రోజులుగా మంచినీటి సరఫరాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో మంచినీటి సరాఫరా చేయాలని కోరారు.

సీఐ వెంకటేశ్వర్లుకు సన్మానం

కడ్తాల్: ఆమనగల్లు సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును మండల బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నరేశ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, చందు, మహేశ్ ఉన్నారు.



వెంకటేశ్వర్లును సన్మానించిన నాయకులు